## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లెమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు జీడీనెల్లూరు, పాలసముద్రం వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

### సప్త కన్నికలకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కన్నికామూర్తులు

పుత్తూరు: పుత్తూరు చెరువు సమీపంలో వెలసిన సప్త కన్నికల ఆలయంలో బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కన్నికా దేవతామూర్తులైన బ్రహ్మి, మహేశ్వరి, కౌమారీ, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండీలకు ఏటా గంగ జాతర అనంతరం అభిషేకార్చనలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం అభిషేకానంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదాన చేశారు.

### మధ్యంతర భృతికి డిమాండ్


సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎస్టీయూ నేతలు

గంగాధర నెల్లూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్టీయూ సభ్యత నమోదు చేపట్టారు. ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాపతి, స్థానిక నేతలు ఢిల్లీ ప్రకాష్, కోటి, విజయ్ పాల్గొన్నారు.

### జీవనోపాధికే రుణాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం : డ్వాక్రా మహిళల జీవనోపాధికే ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘ లీడర్లు, సంఘమిత్ర, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ రుణాలుతీసుకుంటున్న డ్వాక్రా సంఘాల సభ్యులు అధిక ఆదాయం వచ్చేవాటిపై పెట్టుబడి పెట్టాలని సూచించారు. రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సమావేశంలో సీసీ లోకనాథం, చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, బాలయ్య పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం


మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటేష్

విజయపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎం.అగరం అంగన్‌వాడీ టీచర్ దీప తెలిపారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవంలో భాగంగా తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం భుజించాలన్నారు. ముఖ్యంగా ఆరు కూరలు, గుడ్లు, కూరగాయలు, పండ్లు, పాలు తీసుకోవాలని సూచించారు.

పాలసముద్రం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ తెలిపారు. బుధవారం శ్రీబొమ్మ రాజుపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అములు, జీవిత, కవిత పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై తక్షణ స్పందన

పెనుమూరు(కార్వేటినగరం) : ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవాలని ఎమ్మెల్యే థామస్ ఆదేశించారు. బుధవారం ఎంపీపీ హేమలత రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల అభివృద్ధిలో ఎమ్మెల్యే భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామి యాదవ్, ఎంపీడీఓ నీలకంఠేశ్వర రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ తులసీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోదండన్, జ్యోతి, సర్పంచ్‌లు దూది వెంకటేశులు, ఎంపీటీసీ సభ్యులు సుభాషిణి పాల్గొన్నారు.

## పురుగు మందులు.. అవసరం.. అప్రమత్తం


పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పురుగు మందుల వాడకంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. చీడపీడలను అరికట్టేందుకు అవసరం మేరకే వినియోగించాలి. రసాయనాలను పిచికారీపై అవగాహన పెంపొందించుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదకు వస్తుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. అలాగే పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోయే ప్రమాదముంటుందని వెల్లడిస్తున్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే అన్నదాతలు రక్షణ పొందడంతోపాటు లాభాలు సాధించవచ్చని సూచిస్తున్నారు.

- చీడపీడలకు అనుగుణంగా వాడకం
- పిచికారీ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సలహా మేరకే వినియోగం

విజయపురం : సీజన్‌కు అనుగుణంగా పంటలకు చీడపీడలు, తెగుళ్ల సోకుతుంటాయి. ఒకటి రెండు పురుగులు కనిపించగానే రైతన్నలు పైరుపై వివిధ రకాల పురుగు మందులు పిచికారీ చేసేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి.

**ఎంపికలో జాగ్రత్తలు అవసరం**

పంటలను ఆశించే పురుగులను నివారించేందుకు తమ మందులు వాడాలని వివిధ కంపెనీలు ప్రచారం చేస్తుంటాయి. అయితే ఏ మందు పడితే ఆ మందును పైరుపై పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. ఇప్పటి వరకు దుకాణదారులు, ఏమందు ఇస్తే అదే వాడడం రైతులకు పరిపాటిగా మారింది. అయితే ఇలాంటి చర్య రైతుకు నష్టాన్నే కలిగిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**గుర్తింపు పొందిన కంపెనీలవే వాడాలి**

గుర్తింపు పొందిన కంపెనీల పురుగు మందులనే రైతులు వాడాలి. మందు డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లో కానీ కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. మందులను నీటిలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులతో పాటు రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కంటిలో పడకుండా రైతులు కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా పురుగుమందు తుంపర్లు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లటి నీళ్లతో బాగా కడిగి వైద్యుడిని సంప్రదించాలి. శరీరంపై గాయాలు ఉన్నవారు మందులు పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయడం ఎంతో ఉత్తమం. పిచికారీ అనంతరం రైతులను రెండు మూడు సార్లు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పశువుల మేత కోసం పెంచిన పైర్లలో మందులు వినియోగించకూడదు. కల్తీ మందులను అసలు వాడకూడదు.

**మోతాదు మేరకే వినియోగం**

వ్యవసాయాధికారుల సూచనలు మేరకే తెగుళ్ల, పురుగుల నివారణకు మందులను వాడాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందులు వాడితే పంటకు నష్టం కలిగించడంతో పాటు అరైతులకు పెట్టుబడి పెరుగుతుంది. పురుగులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి అధికమవుతుంది. పైరుపై ఎక్కువ సార్లు మందులను పిచికారీ చేయడం మంచిదికాదు.

## ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమే

- ముందస్తు హెచ్చరికలు చేయకపోవడం దారుణం
- సహాయక చర్యల్లోనూ సర్కారు విఫలం
- వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి


కృపాలక్ష్మి

వెదురుకుప్పం : విజయవాడలో వరద సృష్టించిన విలయానికి ప్రభుత్వ తప్పిదమే ముమ్మాటికీ కారణమని వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాలపై వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తుందని, అయితే ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి సరైన జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇంతటి విపత్తు జరిగేది కాదన్నారు. విజయవాడలో వరద విలయం సంభవిస్తుందని ముందే చెప్పినా కూటమి ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విజయవాడలో మునుపెన్నడూ లేని విపత్తుకు ప్రధాన కారణం సీఎం చంద్రబాబే అని విమర్శించారు. ఎవరినో రక్షించేందుకు ప్రజలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడంతోనే ఊహించని నష్టం సంభవించినట్లు చెప్పారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులను తరలించేందుకు ముందుకురాలేదన్నారు. వరద నీరు చేరి అల్లాడుతున్నా కేవలం బోట్లలో షికారు చేసి ఫొటో షూట్ దిగి ప్రజల ప్రాణాలను గాలికొదిలేసినట్లు ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా లక్షల మంది ఆకలికేకలతో అలమటిస్తున్నా కూటమి ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. విపత్తును ఎదుర్కోలేక ప్రతిపక్షంపై నిందారోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. భారీ వర్షాలతో వరదలు వస్తాయని ముందే తెలిసినా ఎలాంటి సహాయక చర్యలు చేపట్ట లేదని తెలిపారు. కేవలం సీఎం చంద్రబాబు నివాసం, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా ఉండాలన్న తాపత్రయంతో వరద నీటిని విజయవాడ వైపు మళ్లించారని వెల్లడించారు. వరదల్లో చిక్కుకుని కనీసం తాగడానికి నీరు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించినట్లు చెప్పారు. డ్రోన్‌లు, విమానాలు, పడవల ద్వారా వరద బాధితులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న నాటకాలు, మోసాలను ప్రజలు గమనించాలని కోరారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించాలని అభ్యర్థించారు.

## ఘనంగా మిథున్‌రెడ్డి జన్మదినోత్సవం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ లతాబాలాజీ

కార్వేటినగరం : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ లత బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ లత మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందించడమే పరమావధిగా భావించే ఉన్నతమైన వ్యక్తి మిథున్‌రెడ్డి అని కొనియాడారు. అనంతరం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఆకుల గోపి, పురంధర్, వెంకటరత్నం, పవన్‌కుమార్, గోపీనాథ్, శేషాద్రి, ప్రభాకర్‌రెడ్డి, లోకనాథనాయుడు, సాయికుమార్, ఆనంద్, మురగయ్య, మోహనకుమారి, అంబిక పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ

నగరి : గంగజాతరను పురస్కరించుకుని స్థానిక ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ రవి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రభు, సభ్యులు ఆనంద్‌కుమార్, కేపీ కుమార్, దామోదరం, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆదేశించారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

### వైభవంగా గంగమ్మ జాతర


కొలువుదీరిన అమ్మవారు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ సీఎం కండ్రిగలో బుధవారం వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారిని ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.

### శివాలయానికి రూ.50వేల విరాళం

గంగాధర నెల్లూరు : కొట్రకోన పంచాయతీలోని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు గారంపల్లెకు చెందిన దాత హిమాచలనాయుడు రూ.50 వేల విరాళం అందించారు. బుధవారం ఈ మేరకు నగదును ఆలయ బ్యాంకు ఖాతాకు జమ చేశారు. దాతను ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.రామమూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శి కె.యుగంధరాచారి అభినందనలు తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


ముని రాజారెడ్డితో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధర నెల్లూరు : వైఎస్సార్‌సీపీ నేత ముని రాజా రెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం పరామర్శించారు. ముని రాజారెడ్డికి గత కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిచ్చి రెడ్డి పల్లి గ్రామంలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన ప్రజలను పేరుపేరునా ఆత్మీయంగా పలకరించారు. అనంతరం ముని రాజారెడ్డి మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వేల్కూర్ బాబు రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, రామచంద్రారెడ్డి, వేల్కూరు కుట్టి పాల్గొన్నారు.

## అమ్మ కడుపు చల్లగా..



రోజా చారిటబుల్ ట్రస్ట్ అందించిన పౌష్టికాహారం భుజిస్తున్న గర్భిణులు తదితరులు

పుత్తూరు/నగరి : పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాజీ మంత్రి ఆర్‌కే రోజా వితరణ కొనసాగుతోంది. ప్రతి బుధవారం గర్భిణులు పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పౌష్టికాహారాన్ని గత కొన్నేళ్లుగా పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పులావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు.

## సేవకు ప్రతిరూపం హెన్రీ భాస్కర్


హెన్రీ భాస్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పుత్తూరు: స్థానిక గుడ్ షెఫర్డ్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఎంఈఓ హెన్రీ భాస్కర్ సేవకు ప్రతిరూపంగా నిలిచారని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు కొనియాడారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో హెన్రీ భాస్కర్ సంస్మరణ సభను మాజీ డీఈఓ గుణశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా హెన్రీభాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కర్‌రాజు మాట్లాడుతూ విద్యా రంగంతో పాటు, గుడ్ షెఫర్డ్ హాస్పిటల్ ద్వారా పేదలకు హెన్రీ భాస్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. క్రిస్టియన్ మినిస్టరీస్ ద్వారా గుడ్ షెఫర్డ్‌ను స్థాపించి, ఎంతో మంది అనాథలకు ఆశ్రయం కల్పించడంతో పాటు విద్యా బుద్ధులు నేర్పించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓలు కేశవులురెడ్డి, యుగంధర్‌రాజు, గుడ్ షెఫర్డ్ సంస్థల ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దతయ్యూరులో నిమజ్జనోత్సవం



## ఘనంగా గణేష్ నిమజ్జనం


వినాయక నిమజ్జనానికి సన్నద్ధమవుతున్న యువకులు

శ్రీరంగరాజపురం : మండలంలోని పెద్దతయ్యూరులో బుధవారం గణనాథుల నిమజ్జనం కనుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల్లో కొలువైన గణపతి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

**పాదిరికుప్పంలో..**

కార్వేటినగరం: మండలంలోని పాదిరికుప్పంలో బుధవారం ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. .ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 5 వందల మందికి అన్నదానం చేశారు. . అలాగే యువతీ యువకులకు కబడ్డీ, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడలను నిర్వహించి ప్రతిభ కనబరిన వారికి బహుమతులను అందించారు. అనంతరం నిర్వహించిన 10 కేజీల లడ్డు వేలం పాటలో యువత పోటీ పడ్డారు. స్వామి వారిని ఊరేగించి గ్రామ సమీపంలోని వంకలో నిమజ్జనం చేశారు.

## వైభవం.. గంగ సంబరం

విశేషాలంకరణలో గంగమ్మ



ఓరుగుంటాలమ్మ సేవలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా తదితరులు



ఏకాంబరకుప్పంలో గంగమ్మ



నగరి పట్టణంతోపాటు సమీప గ్రామాల ప్రజలు గంగమ్మ సేవలో తరించారు. సంబరంగా జాతర జరుపుకున్నారు. చల్లంగా చూడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఓరుగుంటాలమ్మ, దేశమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నడివీధిలో కొలువైన గంగమ్మను కనులా వీక్షించి తన్మయత్వం చెందారు. కుంభ నైవేద్యం సమర్పించి పులకించారు. – నగరి


అమ్మవారి దర్శనానికి తరలివస్తున్న భక్తులు


నిమజ్జనోత్సవాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు